## జవాన్ భూమి కబ్జా

- న్యాయం చేయాలని వేడుకోలు
- స్పందించిన మాజీమంత్రి హరీశ్‌రావు
- చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు ఫోన్


జవాన్ బూర రామస్వామి

దుబ్బాక, మే17 : దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పోరాటం చేస్తుంటే.. స్వగ్రామంలో తన భూమికి రక్షణ లేకుండా పోయిందని సోషల్ మీడియాలో ఓ జవాన్ తన ఆవేదన వ్యక్తం చేశాడు. వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం అక్బర్‌పేట-భూంపల్లి మండలం చౌదర్‌పల్లికి చెందిన జవాన్ బూర రామస్వామి కశ్మీర్ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తున్నాడు. రామస్వామి ఓ వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. ప్రాణాలకు తెగించి కశ్మీర్‌లో విధులు నిర్వహిస్తుంటే, స్వగ్రామంలో తన కుటుంబానికి చెందిన వ్యవసాయ భూమిని వీఆర్వో రమేశ్, అతడి సోదరుడు కలిసి రికార్డుల్లో లేకుండా చేసి, తన తల్లిదండ్రులు శామవ్వ, వెంకటయ్యను బెదిరిస్తున్నారని తెలిపాడు. వీడియోను చూసిన మాజీమంత్రి హరీశ్‌రావు స్పందించి వెంటనే కలెక్టర్ మనుచౌదరితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ ఆదేశాలతో అక్బర్‌పేట-భూంపల్లి తహసీల్దార్ మల్లికార్జున్‌రెడ్డి చౌదర్‌పల్లిలో సైనికుడి కుటుంబానికి చెందిన భూమిని పరిశీలించి వివరాలు సేకరించారు.


మావోయిస్టుల అరెస్టు చూపి వివరాలు వెల్లడిస్తున్న ములుగు ఎస్పీ శబరీశ్

## 20 మంది మావోయిస్టుల అరెస్టు

- ఆయుధాలు, మందుగుండు సామగ్రి స్వాధీనం
- ములుగు ఎస్పీ డాక్టర్ శబరీశ్ వెల్లడి

ములుగు, మే17(నమస్తే తెలంగాణ) : నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీకి చెందిన 20 మందిని శనివారం ములుగు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను ఎస్పీ డాక్టర్ శబరీశ్ ములుగులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ములుగు జిల్లా వెంకటాపురం(నూగూరు), వాజేడు, పేరూరు పోలీస్ స్టేషన్ పరిధితో పాటు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఎలిమిడి, ఊసూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో మావోయిస్టులు గ్రూప్‌లుగా విడిపోయి అడవిలో సంచరిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు గాలింపు చేపట్టారు. శుక్రవారం వెంకటాపురం పీఎస్ పరిధిలో పాలెంవాగు ప్రాజెక్టు వద్ద మావోయిస్టు ఏరియా కమిటీ సభ్యులు కుంజం లక్క, మారిగల సుమతి, పార్టీ సభ్యులు మడకం కోసి, పొడియం జోగా, మడవి సీమ, ముసాకి రంజాను అరెస్టు చేశారు. ముదుమూరు వద్ద డివిజన్ కమిటీ సభ్యుడు కట్టం భీమ్, ఏరియా కమిటీ సభ్యురాలు మడకం మాసే, పార్టీ సభ్యులు సోడి ఉంగి, వంజాం మాసే, హేమల సుక్కి, కుంజం ఉంగా, పూనెం భీమేను అరెస్టు చేశారు. గుట్టల గంగారం గొత్తికోయగూడెంలో ఏరియా కమిటీ సభ్యుడు కట్టం జోగా, పార్టీ సభ్యులు పూనెం భీమే, సుపా గంగి, హేమల సన్ని, ఊకె మాసా, పొడియం లక్క, ఉండం సోమడు ఉన్నట్లు పేర్కొన్నారు. వీరి నుంచి మూడు 6 ఎంఎం రైఫిల్, నాలుగు ఎస్ఎల్ఆర్‌లు, 303 రైఫిల్, నాలుగు 8 ఎంఎం రైఫిల్, 12 బోర్ వెపన్స్, రెండు గ్రానైట్స్, 17 మ్యాగజైన్‌లు, 180 రౌండ్‌ల బుల్లెట్స్‌తోపాటు రూ.58,155, నాలుగు వాకీటాకీలు, ఆరు రేడియోలు, 9 చార్జింగ్ బ్యాటరీలు, ఆరు పెన్‌డ్రైవ్‌లు, ఆరు మెమోరీ కార్డులు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వెల్లడించారు.

### జగిత్యాల జైత్రయాత్ర

## నారాయణ కన్నుమూత

- తొలితరం నక్సలైట్ ఉద్యమకారుల్లో ఒకరు
- బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు సంతాపం


నారాయణ (ఫైల్)

జగిత్యాల, మే 17 (నమస్తే తెలంగాణ): జగిత్యాల జైత్రయాత్ర నిర్మాతల్లో ఒకరైన పండుగ నారాయణ (75) కన్నుమూశారు. మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఈ నెల 15న తుదిశ్వాస విడిచారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. 1968లో పీయూసీ చదివిన నారాయణ కొంతకాలం ప్రైవేట్ స్కూల్ నడిపారు. ఆ తరువాత నక్సలైట్ల ఉద్యమంలో చేరారు. ఎమర్జెన్సీలో రహస్య జీవితం గడిపి, తర్వాత కేంద్రంలో జనతా పార్టీ అధికారంలోకి రావడంతో బహిరంగ ప్రజాఉద్యమాల నిర్మాణం చేపట్టారు. విద్యార్థులు, యువత, రైతుకూలీల్లో ఆయన రగిలించిన చైతన్యంతో వారంతా భూస్వాములకు వ్యతిరేకంగా ఉద్యమించారు. జూలై 17న ఏర్పాటుచేసిన రైతుకూలీ సంఘం మహాసభ, జగిత్యాల జైత్రయాత్రగా ప్రసిద్ధి పొందింది. దీని వెనుక నారాయణ కీలకపాత్ర పోషించారు. జగిత్యాల జైత్రయాత్ర యాత్ర అనంతరం జగిత్యాల, సిరిసిల్ల తాలూకాలను నాటి ప్రభుత్వం కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించింది. అనేక కేసుల కారణంగా ఆయన జైలు జీవితం గడిపి 1984 ఫిబ్రవరిలో బయటకు వచ్చారు. అనంతరం హైదరాబాద్‌కు మకాం మార్చిన నారాయణ ఏపీఎస్‌ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు. కొన్నాళ్లకు స్వగ్రామం చేరుకొని అక్కడే స్థిరపడ్డారు.

## ఫీజు పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

### ఏబీవీపీ డిమాండ్

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): ఇంజినీరింగ్ కళాశాలల ఫీజుల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. శనివారం తెలంగాణ ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డికి ఏబీవీపీ బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా హైదరాబాద్ సిటీ సెక్రటరీ పృథ్వీతేజ మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూడేండ్లకు ఒకసారి పెరిగే ఇంజినీరింగ్ కళాశాలల ఫీజులను ఇష్టారీతిన పెంచడానికి ప్రతిపాదనలు పంపిన టీఏఎఫ్‌ఆర్సీ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. కళాశాలలు తప్పుడు ఆడిట్ లెక్కలు చూపిస్తూ ఫీజులు పెంచుకొని పేద విద్యార్థుల దగ్గర లక్షలకు లక్షలు డబ్బులు వసూలు చేయడానికి సిద్ధం అవుతున్నాయని ఆరోపించారు. తప్పుడు ఆడిట్ లెక్కలు చూపించిన కళాశాలలను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు.


# సింగిల్ విండోకి తూట్లు!

### ఫ్రెండ్లీ విధానానికి రాష్ట్ర సర్కార్ ఫుల్‌స్టాప్

### ఇబ్బందులు పడుతున్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

### తిరోగమన దిశగా రాష్ట్ర పారిశ్రామిక రంగం

హైదరాబాద్, మే 17 (నమస్తే తెలంగాణ): పెట్టుబడిదారుల పట్ల స్నేహపూర్వక విధానాలు, అనుమతుల కోసం సింగిల్ విండో వ్యవస్థ... ఇదీ తెలంగాణ పారిశ్రామిక రంగం పట్ల ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రత్యేక ముద్ర. అయితే ఇది ఒకప్పటి మాట. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైనప్పటినుంచి రాష్ట్రం ఈ ప్రత్యేకతను కోల్పోయిందనే ప్రచారం పరిశ్రమ వర్గాల్లో జోరుగా సాగుతున్నది. భూ కేటాయింపులు లేక, అనుమతులు లభించక ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు నానా ఇబ్బందులు పడుతున్నారు. భారీగా పెట్టుబడులు సాధిస్తున్నట్లు సర్కార్ ఊదరగొడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి మరోలా ఉంది. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే టీఎస్ ఐపాస్(తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ప్రాజెక్ట్ అప్రూవల్ అండ్ సెల్ఫ్ సర్టిఫికేషన్ సిస్టం) చట్టాన్ని ప్రవేశపెట్టిన విషయం విదితమే. నూతనంగా ఏర్పాటైన రాష్ట్రం కావడంతో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు రాష్ట్రాన్ని పరిశ్రమలకు గమ్యస్థానంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో అప్పటి సీఎం కేసీఆర్ ఈ మేరకు వినూత్న చట్టానికి శ్రీకారం చుట్టారు. అంతేకాదు, ఈ నిర్ణయం వెనుక కూడా పెద్ద కసరత్తే జరిగింది. పారిశ్రామికవేత్తలతో సుమారు 9 గంటలపాటు సుదీర్ఘంగా చర్చించి.. వారు ఆలోచనలకు అనుగుణంగా ఈ చట్టానికి రూపకల్పన చేశారు. ఓ వైపు కొత్త పారిశ్రామికవాడలను అభివృద్ధి చేస్తూనే.. మరోవైపు ఉన్న పరిశ్రమలను కాపాడుకునేందుకు రెప్పపాటు కూడా కరెంటు పోకుండా తగిన చర్యలు తీసుకున్నారు. మరోవైపు, పరిశ్రమల శాఖ మంత్రిగా కేటీఆర్ దేశ విదేశాల నుంచి పెట్టుబడులు రాబట్టేందుకు, ముఖ్యంగా బహుళ జాతి సంస్థలు రాష్ట్రంలో కొలువుదీరే విధంగా, వారు తమ పెట్టుబడులను మరింత విస్తరించుకునే విధంగా తనదైన శైలిలో విశేషంగా కృషిచేశారు.


కాగితాలకే పరిమితమైన టీజీ ఐపాస్....

పెట్టుబడిదారులు అనుమతుల కోసం ఎక్కడా తిరగకుండా పరిశ్రమకు అవసరమైన అన్ని శాఖల అనుమతులు ఒకే దరఖాస్తుతో ఆన్‌లైన్ ద్వారా లభించడమే టీజీ ఐపాస్ ప్రత్యేకత. పదేళ్లపాటు నిరాటంకంగా సాగిన ఈ చట్టం రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పాటైనప్పటినుంచి గాడితప్పింది. ఇప్పుడా అనుమతుల జారీ ప్రక్రియ పూర్తిగా నిలిచిపోయింది. కనీసం దరఖాస్తులను పరిశీలించే వారు లేకుండా పోయారు. మంత్రులు, ఎమ్మెల్యేల సిఫారసు ఉంటేనే పరిశ్రమకు అనుమతులు మంజూరవుతున్నాయి. దీంతో టీజీఐఐసీలో వందలాది దరఖాస్తులు అటకెక్కాయి. అంతేకాదు, పెట్టుబడిదారులతో చర్చించి వారి సమస్యలు, డిమాండ్లను విని సానుకూల ధోరణితో పరిష్కరించే చర్యలు ప్రభుత్వం తీసుకోవడం లేదు. గతంలో ఏ పారిశ్రామికవేత్త తనకు ఏ విధమైన సమస్య ఎదురైనా వెంటనే కేటీఆర్‌కు చెబితే క్షణాల్లో సమస్య పరిష్కారమయ్యేది. ఇప్పుడా స్నేహపూర్వక విధానం కనుమరుగై స్తబ్ధత నెలకున్నది.

**దరఖాస్తుల పరిస్థితి ఇలా..**

- గత 15 నెలల్లో అనుమతులు, భూమి కోసం వచ్చిన దరఖాస్తులు- **1,530**
- వీటిలో అనుమతులు మంజూరైనవి (సిఫారసుల ద్వారా)- **124**
- పెండింగ్‌లో ఉన్నవి- **1406**



- ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఓ పారిశ్రామికవాడలో రూ. 2 కోట్ల పెట్టుబడితో ఎంఎస్‌ఎంఈ యూనిట్‌ను నెలకొల్పడానికి ముందుకొచ్చిన ఓ ఔత్సాహిక పారిశ్రామికవేత్తకు టీజీఐఐసీ అధికారులు చుక్కలు చూపించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుచేసి ఆరు నెలలు ఆఫీసు చుట్టూ తిరిగినా ఆయనకు కనీసం ఉన్నతాధికారుల వద్ద అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదు. దీంతో చేసేదిలేక స్థానిక ఎమ్మెల్యేతో ఫోన్ చేయించుకుంటే ఆయనకు అర ఎకరం భూమి కేటాయించారు.
- మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ఓ ఇండస్ట్రియల్ పార్క్‌లో గతంలో భూమి కొనుగోలు చేసిన ఓ ఔత్సాహిక పారిశ్రామికవేత్త ఇటీవల అక్కడ షెడ్లు నిర్మించేందుకు వెళ్లగా ఓ స్థానిక కాంగ్రెస్ నేత అడ్డుకొని తన అనుమతి లేకుండా ఎటువంటి నిర్మాణాలూ చేయరాదని హుకుం జారీ చేశారు. దీంతో సదరు పారిశ్రామికవేత్త భూమి కోసం తాను చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వాలని గత మూడు నెలలుగా టీజీఐఐసీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు.
- మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలోని ఇండస్ట్రియల్ పార్క్‌లో 1,000 గజాల జాగా కేటాయించాలని ఓ యువ పారిశ్రామికవేత్త సంవత్సరకాలంగా టీజీఐఐసీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అయితే, అతని ఆన్‌లైన్ దరఖాస్తును అధికారులు ఇంతవరకు పరిశీలించకపోగా, స్థలం కేటాయింపు చేస్తే ఆ సమాచారం తామే ఇస్తామని, ప్రతీసారి ఇలా కార్యాలయం చుట్టూ తిరగొద్దని అక్కడి అధికారులు ఉచిత సలహా ఇచ్చారు.
- ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌లో ఓ అద్దె భవనంలో చిన్నతరహా ఐటీ కంపెనీ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇవ్వాలని ఓ ప్రవాస భారతీయుడు 4 నెలలుగా టీజీఐఐసీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. అధికారులు రకరకాల కొర్రీలు వేస్తూ తిప్పతున్నారు తప్ప పని కావడంలేదు. తాను ఇప్పటికే భవనానికి అడ్వాన్స్ చెల్లించి ఉద్యోగులను కూడా నియమించుకున్నట్లు చెప్పినా ఆయన మాట వినే నాథుడే లేడు.




## రెడ్డీస్ ప్లాంట్లో తనిఖీలు

న్యూఢిల్లీ, మే 17: ప్రముఖ ఫార్మా దిగ్గజం డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్‌కు అమెరికాలో ఉన్న ప్లాంట్లో అమెరికా నియంత్రణ మండలి ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో రెండు అభ్యంతరాలు వ్యక్తంచేయడంతోపాటు ఫామ్ 483ని జారీ చేశారు. న్యూయార్క్‌లో రెడ్డీస్‌కు ఉన్న ఏపీఐ యూనిట్‌లో ఈ నెల 12 నుంచి 16 వరకు తనిఖీలు చేసినట్టు కంపెనీ బీఎస్‌ఈకి సమాచారం అందించింది.

## తగ్గిన టీవీఎస్ ఐక్యూబ్ ధర

న్యూఢిల్లీ, మే 17: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ టీవీఎస్ కీలక నిర్ణయం తీసుకున్నది. తన ఎలక్ట్రిక్ స్కూటర్ మాడల్ ఐక్యూబ్ ధరను భారీగా తగ్గించింది. బ్యాటరీ కెపాసిటీని పెంచడంతోపాటు ధరను రూ.26 వేల వరకు దించింది. ఐక్యూబ్, ఐక్యూబ్ ఎస్ మాడళ్ల ధరలను రూ.16 వేలు తగ్గించిన సంస్థ..ఐక్యూబ్ ఎస్‌టీ మాడళ్లను రూ.26 వేలకు తగ్గించింది. దీంతో ఐక్యూబ్ స్కూటర్ ప్రారంభ ధర రూ.1.31 లక్షలకు దిగిరాగా, గరిష్ఠ ధర రూ.1.59 లక్షలకు తగ్గింది. ఈ ధరలు వెంటనే అమలులోకి రానున్నట్లు పేర్కొంది. అలాగే బ్యాటరీ కెపాసిటీని 3.4 కిలోవాట్ల నుంచి 3.5 కిలోవాట్లకు పెంచిన సంస్థ..మరో మాడల్‌ను 5.1 కిలోవాట్ల నుంచి 5.3 కిలోవాట్లకు పెంచింది. సింగిల్ చార్జింగ్‌తో ఐక్యూబ్ ఎస్ మాడల్ 145 కిలోమీటర్లు, ఐక్యూబ్ ఎస్‌టీ మాడల్ 212 కిలోమీటర్లు ప్రయాణించనున్నది.



### మధ్యస్థాయి ఐటీ ఉద్యోగులకు

## బంపర్ ఆఫర్

న్యూఢిల్లీ, మే 17: దేశీయ మధ్యస్థాయి ఐటీ ఉద్యోగుల పంటపండింది. గడిచిన నాలుగేండ్లలో వీరి వేతనాలు 30 శాతం వరకు పెరిగాయి. 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.7 లక్షలుగావున్న వార్షిక వేతనం గడిచిన ఆర్థిక సంవత్సరంనాటికి రూ.10 లక్షలకు పెరిగింది. ఇన్ఫోసిస్, విప్రో సంస్థలు వేతనాలను 30 శాతం వరకు పెంచగా...టెక్ మహీంద్రా, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ, కాగ్నిజెంట్, యాక్సెంచర్‌లు ఉద్యోగులకు నిరాశనే మిగిల్చాయి.

## సమ్మె వాయిదా నిరాయుధులను చేసింది

గోదావరిఖని, మే 17: ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె జూలై 9కి వాయిదా కార్మికులను నిరాయుధులను చేసిందని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, కార్యదర్శి ఆకుల వెంకన్న అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. భారత్ సరిహద్దుల్లో కాల్పుల విరమణ జరిగి దేశంలో సాధారణ పరిస్థితి నెలకొన్నప్పుడు కార్మిక వర్గం తన హక్కులపై దాడులకు వ్యతిరేకంగా పోరాటాన్ని ఎందుకు వాయిదా వేయాలని ప్రశ్నించిన వారు సమ్మె వాయిదాను ఖండించారు. ఇక్కడ ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఈ నరేశ్, ఉపాధ్యక్షుడు చిలుక శంకర్, ప్రధానకార్యదర్శి బీ అశోక్, జిల్లా నాయకులు రాజేశం, కొమురయ్య, రవికుమార్, లింగయ్య, సాంబయ్య, పోచయ్య, సారయ్య, తదితరులు ఉన్నారు.

## అలరించిన కళోత్సవాలు

కోల్‌సిటీ, మే 17: స్థానిక ఆర్‌సీఓఏ క్లబ్‌లో శనివారం గోదావరి కళా సంఘాల సమాఖ్య 37వ వార్షికోత్సవం సందర్భంగా కళో త్సవాలు వైభవంగా జరిగాయి. ఈ ప్రాంతానికి చెందిన పలువురు కళాకారులను గోదావరి కళారత్న పురస్కారాలతో సత్కరించారు. సమాఖ్య అధ్యక్షుడు కనకం రమణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ రాష్ట్ర సెక్రెటరీ ఈర్ల జాన్ సామ్యుల్, సమాఖ్య వ్యవస్థాపకుడు బొంకూరి మధు, సీనియర్ కళాకారులు దామెర శంకర్, సంకె రాజేశ్, కాశిపాక రాజమౌళి, రేణిగుంట్ల రాజమౌళితో పాటు 500 మంది కళాకారులు పాల్గొన్నారు.

## అట్రాసిటీ కేసు నమోదు చేయండి

కోల్‌సిటీ, మే 17: పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను అభివృద్ధి పనులు, ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకుండా అవమానిస్తున్న పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల కలెక్టర్లపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, సభ్యులు కొంకటి లక్ష్మీనారాయణలకు శనివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సరస్వతీ పుష్కరాల్లో ఎంపీకి జరిగిన అవమానానికి భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌తోపాటు దేవాదాయ శాఖ అధికారులపై అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు చేపట్టాలని కోరారు.

## మంథనిలో వైద్య శిబిరం

మంథని, మే 17: కరీంనగర్ మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో పట్టణంలోని రాఘవనగర్‌లో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మందికి డాక్టర్ దీక్షిత్ వైద్య పరీక్షలు చేశారు. మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, బొంగోని హరీష్ ఉన్నారు.

## ప్రమాదంలో ఎన్టీపీసీ కార్మికునికి గాయాలు

జ్యోతినగర్, మే 17: ఎన్టీపీసీ తహర్ దుర్గ అనే కాంట్రాక్ట్ కార్మికుడు శనివారం రాత్రి విధుల్లో ఉండగా తీవ్ర గాయాలయ్యాయి. తెలంగాణ ప్రాజెక్టులో జెంబో ఎలక్ట్రికల్ వాహనం నడుపుతుండగా అదుపుతప్పి కాలువలో పడిపోయింది. దీంతో కిందపడిన తహర్‌దుర్గ రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని స్థానిక ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి దవాఖానకు తరలించారు.

## వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడు చోరీ

ముత్తారం, మే 17: వృద్ధురాలి మెడలోని పుస్తెలతాడును ఓ దుండగుడు అపహరించారు. ఈ సంఘటన మండల కేంద్రంలోని కాసర్లగడ్డలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కాసర్లగడ్డలో నివాసం ఉంటున్న పింగిలి ప్రమీల తన ఇంట్లో ఉండగా శనివారం రాత్రి 8.30 సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పిలువగా వచ్చి తలుపు తీసే క్రమంలో తన మెడలో ఉన్న రెండు తులాల పుస్తెలతాడును తెంపుకొని పారిపోయాడు. మెడ నుంచి తాడుని బలంగా లాగడంతో ప్రమీల కిందపడగా గాయాలయ్యాయి. వెంటనే పోలీసులు ప్రమీల ఇంటికి చేరుకొని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అభివృద్ధి కోసం ప్రజా ఉద్యమాలు చేస్తాం

**కరీంనగర్‌ను కళావిహీనంగా మార్చేశారు**

- పరిపాలన జరుగుతున్నదా లేదా?
- 18 నెలల్లో ఒక్క సమీక్ష కూడా పెట్టలేదు
- ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో అతిపెద్ద కుంభకోణం
- సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్‌ఎస్‌తో కంటే సొంత మంత్రులతోనే ముప్పు
- రాబోయే రోజుల్లో వంద సీట్లతో అధికారంలోకి వస్తాం
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి
- కేసీఆర్ హయాంలో వచ్చిన పనులను కొనసాగించాలని కలెక్టర్‌కు వినతి

కరీంనగర్, మే 17(నమస్తే తెలంగాణ) : కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ హయాంలో మంజూరైన పనులు కొనసాగించాలని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై కరీంనగర్ కలెక్టర్‌ను ఇప్పటికే నాలుగైదు సార్లు కలిసి విన్నవించామని, ఆమె ప్రభుత్వానికి నివేదించినా ఎలాంటి చలనం కనిపించ లేదన్నారు. జిల్లా సమస్యలపై ఏ మంత్రి కూడా పట్టించుకోవడం లేదని, కరీంనగర్ జిల్లా మొత్తం గందరగోళంగా తయారైందని, జిల్లా మంత్రులు రావడం లేదని, ఇన్‌చార్జి మంత్రి కూడా పట్టించుకోవడం లేదనే ఆవేదనతో కలెక్టర్‌కు కలిసి విన్నవించుకున్నా ఫలితం కనిపించడం లేదన్నారు.

### కరీంనగర్‌ను కళావిహీనం చేశారు

తెలంగాణ ఏర్పడిన మొదటి పదేళ్లలో కళకళాడిన కరీంనగర్ 18 నెలల కాంగ్రెస్ పాలనలో కళావిహీనంగా తయారైందని ఎమ్మెల్యే గంగుల ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో వేలాది కోట్లు తెచ్చి కరీంనగర్‌ను అభివృద్ధి చేశామని, ఇంకా కొనసాగించాల్సిన అభివృద్ధి ఎంతో ఉందని తెలిపారు. అభివృద్ధిని పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతిలో మాత్రం నంబర్ వన్ స్థానానికి చేరుకుందన్నారు. కాంగ్రెస్ నాయకులు కొత్తగా అభివృద్ధి చేయాలని తాము కోరడం లేదని, కేవలం కేసీఆర్ ఇచ్చిన పనులనే కొనసాగించాలని అడుగుతున్నామని చెప్పారు. కానీ, ఈ పనులను ప్రభుత్వం ఆపేస్తున్నదని, అందుకే ఆఖరి సారి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చామని, దీనిపై ప్రభుత్వం స్పందించకుంటే తాము మరో విధంగా స్పందించాల్సి వస్తుందని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ పక్షాన దశల వారీగా ప్రజా ఉద్యమాలు చేపడతామని, కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసనలు చేస్తామని స్పష్టం చేశారు. కరీంనగర్‌లో రోడ్లు తవ్వి వదిలేస్తున్నారని, పనులు కొనసాగించడం లేదని, ఈ పనులను వారం పది రోజుల్లో పూర్తి చేయకుంటే తామే ఒక నిర్ణయం తీసుకుని బీటీ, సీసీ రోడ్లు శ్రమదానంతో వేసుకుంటామని చెప్పారు. సీఎం అష్యూరెన్స్ కింద 65 రోడ్లు ప్రారంభించామని, స్విచ్ఆఫ్ చేసినట్లు ప్రభుత్వం రోడ్ల పనులను నిలిపివేసిందని అన్నారు. ఏడాదిన్నరగా కంకర పోసిన రోడ్లు అలాగే ఉన్నాయని, ఇప్పటి వరకు ఒక్క రోడ్డు కూడా పూర్తి చేయలేదని తెలిపారు. కరీంనగర్‌కు ప్రతి రోజూ నీటి సరఫరా చేశామని, 24 గంటల పాటు నీళ్లు ఇచ్చే పథకానికి శ్రీకారం చుట్టామని, కానీ, ఇపుడు ఆరు రోజులుగా రాంనగర్‌లో నీటి సరఫరా కావడం లేదని, మోటర్లు కాలిపోయాయని అధికారులు చెబుతున్నారని, వాటిని రిపేర్ చేసే పరిస్థితి కూడా లేదని మండిపడ్డారు. డంప్ సమస్య కూడా అలాగే ఉందని కరీంనగర్‌లో ఎనిమిది నెలలుగా అనేక కాలనీల్లో లైట్లు వెలగడం లేదని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన లైట్లు తెప్పించాలని ఇది వరకే చెప్పినా పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. కరీంనగర్ నుంచి సిరిసిల్ల రోడ్డులో అద్భుతంగా లైట్లు వేశామని, కానీ, అవి వెలగక అంధకారం అయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణ భారత దేశంలోనే అద్భుతమైన కేబుల్ బ్రిడ్జిపై డైనమిక్ లైటింగ్ పెట్టామని, ఇప్పుడు ఒక్క లైట్ కూడా వెలగగం లేదన్నారు. ఇక్కడ వీకెండ్ మస్తీ జరిగేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఏ మీటింగ్ ఏ మంత్రి పెట్టాలో కూడా తెలియడం లేదని, అందుకే కలెక్టర్‌ను డీఆర్‌సీ మీటింగ్ పెట్టాలని డిమాండ్ చేశామని అన్నారు.


కలెక్టర్‌ను కలిసిన తర్వాత మీడియాతో మాట్లాడుతున్న హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

### ఇందిరమ్మ ఇండ్లు ఎవరికిచ్చారు?

జీవో నంబర్ 7 ప్రకారం కలెక్టర్ సాంక్షన్ తీసుకుని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని ఉందని, కానీ అందుకు విరుద్ధంగా ఎంపికలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే గంగుల మండిపడ్డారు. కరీంనగర్ నియోజకవర్గంలో ప్రజాపాలనలో ఆమోదం తెలిపిన ఫైల్ కలెక్టర్ వద్ద ఉన్నదని, అధికార కాంగ్రెస్ పార్టీకి నియోజక వర్గ ఇన్‌చార్జిగా ఉన్న వ్యక్తిని సదరు పార్టీ నుంచి సస్పెండ్ చేశారని, ఆయన ఇచ్చిన జాబితాను ఇప్పుడు రద్దు చేసి, కొత్తగా వచ్చే ఇన్‌చార్జి ఇచ్చే జాబితాను తీసుకోవాలని చూస్తున్నారని, ప్రజాపాలనలో ఆమోదం పొందిన జాబితా కలెక్టర్ వద్ద ఉన్నదని, దాని ప్రకారం ఇండ్లు మంజూరు చేసి, ప్రతి గ్రామంలో జాబితా ప్రదర్శించాలని కలెక్టర్‌ను కోరినట్లు గంగుల తెలిపారు. లంచాలు తీసుకుని ఇండ్లు సాంక్షన్ చేస్తున్నారని, అనర్హులకు ఇండ్లు ఇస్తే ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. తాము అమలు చేసిన దళిత బంధు, కళ్యాణ లక్ష్మి వంటి పథకాలను పార్టీలకు అతీతంగా ఇచ్చామని, ఇందిరమ్మ ఇండ్లు కూడా ఇదే మాదిరిగా ఇవ్వాలని కోరారు. ఇప్పటి వరకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, జిల్లాలో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎంత మందికి ఇచ్చారనేది ఇప్పటి వరకు వెల్లడించలేదని తెలిపారు. ఒక పక్క ఇచ్చిన రేషన్ కార్డులన్నీ రద్దు చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కొత్త రూల్ పెడుతున్నట్లు తెలిసిందని, ఈ రకంగా ప్రజలను తీవ్రమైన గందరగోళానికి గురి చేస్తున్నారని అన్నారు. మున్సిపాలిటీల్లో విలీనమైన గ్రామాల్లో పారిశుధ్యం కొరవడి, లైటింగ్ వ్యవస్థ దెబ్బతిన్నదని, ఇటు మున్సిపాలిటీ, అటు పంచాయతీ నిధులు నోచుకోక రెంటికీ చెడ్డ రేవడిలా ఈ గ్రామాల పరిస్థితి తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. విలీన గ్రామాలకు వెంటనే ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ జరపాలని డిమాండ్ చేశారు. కరీంగనర్‌లో ఐలాండ్స్ అద్భుతంగా అభివృద్ధి చేశామని, ప్రజలు వాటి వద్ద సెల్ఫీలు తీసుకునే పరిస్థితి ఉండేదని, ఇప్పుడు పూర్తి అధ్వాన్నంగా తయారయ్యాయని, కొత్తగా నిధులు తేవాల్సిన అవసరం లేదని, ఉన్న పనులను కొనసాగిస్తే అభివృద్ధి అదే జరుగుతుందని తెలిపారు. కక్ష సాధింపు ధోరణిని అభివృద్ధి పనులు చూడవద్దని, తక్షణమే పెండింగ్ పనులను కొనసాగించాలని కోరారు.

### నగరపాలక సంస్థలో ఏం జరుగుతోంది?

కరీంనగర్ నగరంలో మున్సిపల్ కమిషనర్ ఏం చేస్తున్నారని, మున్సిపాలిటీలో ఏంజరుగుతుందో తెలియడం లేదని, నగరం కంపు కొడుతున్నా పట్టించుకునే వారు లేరని ఎమ్మెల్యే గంగుల మండిపడ్డారు. మున్సిపల్ అధికారులు నగరంలో పర్యవేక్షించడం లేదన్నారు. నీటిని సరఫరా చేసే కరెంట్ మోటర్లు కాలిపోయి వారం రోజుల దాకా బాగు చేయకుంటే ప్రజలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ప్రతి రోజు వాటర్ ఇచ్చే వ్యవస్థ ఉన్నా, కొన్ని ప్రాంతాలకు వారానికి ఒక రోజు కూడా ఇవ్వడం లేదని, అధికారులు, అధికార పార్టీ నాయకులు ఏం చేస్తున్నారని నిలదీశారు. ప్రజలు అయోమయ పరిస్థితిలో ఉన్నారని, అధికార పార్టీ నాయకుల మెడలు వంచి పనులు చేయిస్తామని, అందుకే వారిపై ఒత్తిడి పెంచుతున్నామని తెలిపారు.

### ఇందిరమ్మ ఇండ్లలో కుంభకోణం

**- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి**

ఇందిరమ్మ ఇండ్లలో మరో భారీ కుంభకోణం జరుగుతోందని, క్షేత్ర స్థాయిలో విచారణ జరపాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఒక్క ఇల్లు సాంక్షన్ చేయాలంటే రూ.50 వేలు లంచంగా తీసుకుంటున్నారని, ఏ కాంగ్రెస్ నాయకుడు తీసుకుంటున్నాడో, ఎవరెవరికి వాటాలు అందుతున్నాయో విచారణ జరపాలని కోరారు. తన నియోజకవర్గంలోనే 107 గ్రామ పంచాయతీలు, 60 మున్సిపల్ వార్డులు ఉన్నాయని, ఏ గ్రామంలోగానీ, ఏ వార్డులో గానీ సభలు పెట్టి లబ్ధిదారులను ఎంపిక చేశారా? అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని కలెక్టర్‌ను అడిగితే ప్రజా పాలనలో గ్రామ సభలు పెట్టామని చెబుతున్నారని, ప్రజా పాలనలో దరఖాస్తులు మాత్రమే తీసుకున్నారని, లబ్ధిదారుల ఎంపికకు ఎక్కడా సభలు పెట్ట లేదని గుర్తుచేశారు. తన నియోజకవర్గంలో 39 వేల మంది ఇందిరమ్మ ఇండ్లకు అర్హులని అధికారులు నిర్ధారించారని, ఇందరిలో బూతుకు 9 ఇండ్లని ఇస్తున్నామని వెల్లడించారని, ఏ గ్రామ సభలో ఈ నిర్ణయం తీసుకున్నారని కౌశిక్‌రెడ్డి ధ్వజమెత్తారు. అర్హులందరికీ ఇండ్లు ఇవ్వాలని, ఇందిరమ్మ ఇండ్ల విషయంలో రాజకీయాలు చేయవద్దని అన్నారు. రాజకీయాలకతీతంగా ఇండ్లు ఇస్తున్నామని చెబుతూనే అధికార పార్టీ నాయకులు రాజకీయం చేస్తున్నారని, ఏ గ్రామ, వార్డు సభలో ఎవరిని అడిగి లబ్ధిదారులను ఎంపిక చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. ఇది ఒక్క హుజూరాబాద్, కరీంనగర్‌లోనే మాత్రం కాదని, తెలంగాణ మొత్తంలో ఇందిరమ్మ ఇండ్ల పేరిట అతి పెద్ద కుంభకోణం జరుగుతున్నదని స్పష్టం చేశారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా ఎంపికైన వారిని విచారిస్తే ఈ విషయం తెలుస్తుందని అన్నారు. గంగుల కమలాకర్ జిల్లా మంత్రిగా ఉన్నపుడు ప్రతి నెలా రివ్యూ మీటింగ్ పెట్టేవారని, కాంగ్రెస్ పాలనలో ఇప్పటి వరకు ఒక్క రివ్యూ మీటింగ్ కూడా జరగ లేదని, జిల్లా ఇంచార్జ్ మంత్రి ఎక్కడో హైదరాబాద్‌లో పడుకుంటారని, రివ్యూ మీటింగ్ పెట్టకుంటే ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయని కౌశిక్ రెడ్డి అన్నారు.

### అందాల పోటీలపైనేనా రివ్యూలు

తన నియోజకవర్గంలో ఎస్‌టీఎఫ్ ఫండ్స్ మంజూరయ్యాయని, కాంట్రాక్టర్లు పనులు చేశారని, ఎంబీ రికార్డులు కూడా పూర్తి చేశారని, ఇప్పుడు వాటిని రద్దు చేస్తున్నామని అంటున్నారని, ఎవరిని అడిగి రద్దు చేస్తున్నారని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. ఎంబీ రికార్డు అయిన తర్వాత ఎలా చేస్తారని, ఈ జిల్లాలో మంత్రులు ఉన్నారా? లేరా? అని, ప్రజల సమస్యలు పట్టించుకుంటరా? లేదా? అని నిలదీశారు. ఇల్లందకుంట మండలం మర్రివానిపల్లిలో అమరేందర్‌రెడ్డి అనే ఒక రైతుకు సంబంధించిన సన్న వడ్లు తీసుకోనని జమ్మికుంట మిల్లర్లు చెబితే, కరీంనగర్ పంపిస్తామని అధికారులు చెబుతున్నారని, జమ్మికుంట మిల్లర్లు ఎందుకు తీసుకోరని ప్రశ్నించారు. అందాల పోటీలపై రివ్యూ మీటింగ్‌లు పెడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి ధాన్యం కొనుగోళ్లపై ఎందుకు రివ్యూ తీసుకోవడం లేదని, అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు అల్లాడి పోతున్నారని, వారిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతుల నుంచి ధాన్యం కొంటున్నారా? లేదా? అని జిల్లాల్లోనో, రాష్ట్రంలోనో రివ్యూ మీటింగ్ నిర్వహించారా? అని నిలదీశారు. విలాసాలు చేసుకోవాలి.. ఎంజాయ్ చేయాలనే ధోరణీలోనే మంత్రులు కనిపిస్తున్నారని అన్నారు. అందాల పోటీలకు తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన సీఎంకు సిగ్గూ శరం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడి నుంచో వచ్చిన వారి కాళ్లను తెలంగాణ ఆడబిడ్డలతో కడించేందుకు సీఎంకు ఎంత ధైర్యం అని నిలదీశారు.

### దళిత బంధు సాయం అందించాలి

హుజూరాబాద్ నియోజకవర్గంలో తమ ప్రభుత్వ హయాంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలైన దళిత బంధు రెండో విడుత నిధులను విడుదల చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తెలిపారు. తన నియోజకవర్గంలో సుమారు రూ.1,800 కోట్లతో ఈ పథకాన్ని అమలు చేశామని, మొదటి విడుత కింద 13 వేల మందికి ఆర్థిక సహాయం అందిందని, మరో సుమారు 5 వేల కుటుంబాలకు రెండో విడుత అందాల్సి ఉందని, దళిత బంధు లబ్ధిదారుల అకౌంట్లో ఉన్న నిధులను వెంటనే విడుదల చేయాలని కోరినట్లు ఆయన వెల్లడించారు. దళిత బంధు ఆర్థిక సహాయాన్ని అందించాలని ఆందోళనకు దిగిన తనతో పాటు అనేక మందిపై కేసులు పెట్టారని, ఈ కేసులు తొలగించాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.